
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 జూన్ 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





హాస్టళ్లలో పరిశుభ్రతకు చర్యలు



పొదలకూరు:: మండలంలోని మహమ్మదా పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లింగంపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు చర్యల్లో జ్వరాల నివారణకు మలాతీయం పౌడర్‌ను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆదిలక్షమి సబ్ యూనిట్ ఆఫీసరు ఆంజనేయ వర్మ ఆరోగ్య విస్తరణ అధికార రవికుమార్ ఆరోగ్య సహాయకులు వెంకటేశ్వర్లు చిత్ర అరుణ ఆశా కార్యకర్తలు రమణమ్మ అంకమ్మ ఆదిలక్ష్మి విజయమ్మ రమాదేవి భారతి వెంకటరమణ ఉన్నారు.

బిడ్డల కోసం తల్లుల ప్రాణ త్యాగం..!

కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. ఎండవేడిమిని తట్టుకోలేక నీటిలో ఆడుకోడానికి పిల్లలు గుంటలో దిగారు..ఎలాంటి రక్షణ లేకుండా, కనీసం హెచ్చరిక బోర్డులు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అభం శుభం తెలియని పిల్లలు నీటిలో దిగి మునిగిపోయారు..అమ్మా...అమ్మా అంటూ కేకలు వేయడంతో తమ బిడ్డలకు ఏమైందోనని ఆందోళనతో ఇద్దరు మహిళలు గుంటలో దిగారు..నీటి గుంటలో మునిగిపోయి ఇద్దరు తల్లులు తనువు చాలించారు. కాలనీ వాసులు పిల్లలను రక్షిం చారు..తల్లులు మాత్రం తమ బిడ్డల కోసం ప్రాణ త్యాగం చేశారు. ఈ సంఘటన నెల్లూరు నగరంలోని వెంకటేశ్వర పురం లోని భగత్ సింగ్ కాలనీలో బుధవారం సాయంత్రం జరిగింది...ఈ సంఘటన తీరు ఇలా ఉంది..

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి ఇద్దరు దుర్మణం
- భగత్‌సింగ్ కాలనీలో దుర్ఘటన
- సిపిఎం, టిడిపి ఆందోళన
- రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు పెన్నానది తీరం.. వెంకటేశ్వరపురం భగత్ సింగ్ కాలనీలో మధ్యాహ్నం 3.30 గంటలకు భానుడు భగ భగ మంటున్నారు... ఎండకి ఇంట్లో ఉండలేని పిల్లలు ఇంటి బయట ఆడుకుంటున్నారు.. అక్కడుండే పిల్లలు కలిసి కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు.. చల్లని నీటిలో ఆడుకుంటే ఉపశమనం కలుగుతుందని భావించారు.. రాష్ట్ర ప్రభుత్వం పెన్నానదికి భగత్ సింగ్ కాలనీ వద్ద రూ.100 కోట్లతో రివిట్‌మెంట్ వాల్ నిర్మాణం చేయడానికి శంకుస్థాపన చేసింది.. రానున్నది ఎన్నికల సీజన్ కావడంతో పనులు ప్రారంభించి, పనులు చేస్తున్నామని చెప్పుకోడానికి సిద్ధమైంది. అవంతి కంపెనీతో కలిసి మరో కంపెనీ జాయింట్ వెంచర్‌లో నిర్మాణం జరుగుతోంది. కొద్ది రోజులుగా జెసిబిలు పెట్టి 25 అడుగులు భారీ గుంతలు తీస్తున్నారు..రెండు రోజుల నుంచి పనులు నిలిచిపోయాయి. పెన్నా నది, భగత్ సింగ్ కాలనీ మధ్యలో గుంతలు తీయడంతో నీరు ఊటతో గుంతలు నిండిపోయాయి. కాలనీకి చెందిన రెహనా, రజియా (చిన్నపాప)తో కలిసి మరికొందరు పిల్లలు అక్కడే ఆడుకుంటున్నారు. చిన్నారులు ఆడుకుంటూ గుంతలో దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో అమ్మా...అమ్మా.. అంటూ అరుపులు కేకలు వేశారు. ఇతర పిల్లలు కేకలు వేయడంతో ఇంట్లోని రెహానా తల్లి ఎస్‌కె సభిహ (25) ఆమె స్నేహితురాలు ఎస్‌కె షాహినా (25) తమ బిడ్డలకు ఏమైందోనని ఆందోళనతో పరుగు పరుగునా అక్కడకు వచ్చారు. పిల్లలు నీటిలో మునిగిపోతున్నారని ఆందోళనతో ఇద్దరు మహిళలు కలిసి గుంతల్లో దిగారు. ఎక్కువ లోతు ఉండడంతో నేరుగా వెళ్లి గుంతలో పడి మునిగిపోయారు. కాలనీ వాసులు పరుగు పరుగున వచ్చి పిల్లలు రెహనా, రజీయాలను కాపాడారు. తల్లులిద్దరు పిల్లల కోసం గుంతలోకి వెళ్లి మళ్లీ తిరిగిరాని లోకానికి వెళ్లిపోయారు. బయట కొచ్చిన పిల్లలు తమ తల్లుల కోసం కన్నీరు మున్నీరయ్యారు. చుట్టుపక్కలవారు గుంతలో దిగి బయటకు తీశారు. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందారు. ఈ సంఘటనతో ఒక్కసారిగా భగత్ సింగ్ కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. కన్నబిడ్డల ప్రాణాలు కాపాడానికి ఇద్దరు తల్లులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. అమ్మా అమ్మా అంటూ చిన్నారులు పెట్టిన కన్నీళ్లతో కాలనీ వాసులు చేత కంటతడి పెట్టించింది..



మృతురాలు ఎస్‌కె సభిహ



మృతురాలు ఎస్‌కె సాహినా

కాంట్రాక్టర్ కక్కుర్తి..!

పెన్నా రివిట్‌మెంట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. అవంతి కంపెనీ మరో కంపెనీతో కలిసి పనులు చేస్తుంది. ఇంత పెద్ద మొత్తంతో పనులు చేస్తున్న కంపెనీ ప్రతినిధులు కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. రివిట్‌మెంట్ కోసం 500 మీటర్ల వరకు 25 అడుగుల లోతులో గుంతలు తీశారు. పక్కన కాలనీ ఉంది. వందలాది కుటంబాలు నివాసం ఉంటున్నాయి. పగలు, రాత్రి ఏ సమయంలోనైనా ఇబ్బందులు జరుగుతాయి. ఎవరూ వెళ్లకుండా చుట్టు కంచె ఏర్పాటు చేయాలి. హెచ్చరిక బోర్డులు పెట్టాలి. కనీసం వాచ్‌మెన్స్ ఏర్పాటు చేయాలి. ఇలాంటివి ఏమీ చేయలేదు. పెద్దలకు అక్కడ ఏం జరగుతుంది.? ఎంత లోతు ఉంది ?. ప్రమాదం ఎంత ? అక్కడకు వెళ్లవచ్చా, వద్దా? అనే విషయాలు తెలుస్తాయి. చిన్న పిల్లలకు ఏం తెలుస్తుంది. అందుకే ఈ ప్రమాదం జరిగింది.



సంఘటనా స్థలం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న సిపిఎం, టిడిపి నాయకులు

సిపిఎం, టిడిపి ఆందోళన..! .

పెన్నానది రివెట్‌మెంట్ వద్ద జరిగిన సంఘటలో మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని సిపిఎం, టిడిపి, ప్రజా సంఘాలు ఆందోళనకు దిగాయి. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సంఘటన స్థలంలో నిరసనకు దిగారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు మహిళలు మృతి చెందారని, నిరుపేద కటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లాకార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలన్నారు. టిడిపి నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన అనుచరులతో ఆందోళనకు దిగారు. ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్‌యాదవ్, కాంట్రాక్టర్ ఇద్దరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు వచ్చే వరకు మృతదేహాలను తరలింలొద్దని ఆపార్టీ నేతలు, కార్యకర్తలు బైఠాయించారు. ఈ సంఘటన జరిగిన సమయంలో నెల్లూరు నగర ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్ యాదవ్ వెంకటేశ్వరపురంలో గడప గడపకు తిరుగుతున్నా రాత్రి వరకు కనీసం పలకరించలేదు. నిరసన కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, నాయకులు మూలం ప్రసాద్, కె.పద్మ, నరసింహ, జాఫర్, మహ్మదా, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించం..

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

మృతిచెందిన ఒక్కొక్క బాధిత కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కలెక్టర్ హామీ ఇచ్చే వరకూ మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించమని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. అదే విధంగా బాధితులపై చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్య నిర్వహణ పనులు పర్యవేక్షణ

ప్రజాశక్తి - నెల్లూరు :ఎసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించి, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక మద్రాస్ బస్టాండ్ వద్దనున్న ఎసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, రమేష్ రెడ్డి నగర్ లోని గోశాల, కలెక్టరేట్ పరిసరాలు, అర్చన సినిమా హాలు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి కమిషనర్ బుధవారం ఉదయం 6.30 గంటలకు పర్యవేక్షించారు. ఎసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్టు లోపల పార్కింగ్ సౌకర్యం గురించి కమిషనర్ పరిశీలించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, మార్కెటింగ్ విభాగం ఏ.డి, మార్కెట్టు కాంట్రాక్టరు, శానిటేషన్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శరవేగంగా కంట్రోల్ రూమ్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి -నెల్లూరు

నగర పాలక సంస్థ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో నగర వ్యాప్తంగా మెరుగైన పారిశుధ్య సేవలు అందిం చడం సాధ్యమవుతుందని నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్యాలయ ప్రాంగణంలో జరుగుతున్న కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని వివిధ విభాగాల నిర్మాణ స్థాయి అభివద్ధి పనులను అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి కమిషనర్ బుధవారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న కమాండ్ కంట్రోల్ కేంద్రంలో నగర వ్యాప్తంగా జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ, నగర పాలక సంస్థ అన్ని విభాగాల సమావేశాలు, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు, విపత్తు నిర్వహణ కేంద్రం, స్పందన పరిష్కార వేదిక, నగర పాలక సంస్థ సమాచార విభాగం వంటి వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. నాణ్యమైన ప్రమాణాలతో నిర్మాణాన్ని త్వరి తగతిన పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో గ్రంథపాలకుడు

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -ఉలవపాడు :వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరితో ముందుగా పుస్తక పఠనం చేపించిన తర్వాత మ్యూజికల్ చైర్స్ ఆటను ఆడిపించారు. గెలుపొందిన విజేతలకు వచ్చే ఆదివారం బహుమతులు అందజేస్తారు. వేసవి నేపథ్యంలో చిన్నారులకు ఉలవపాడు వాస్తవ్యులు శ్రీ,పువ్వాడి వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు పువ్వాడి లక్ష్మీనారాయణ అందరికి చల్లటి లస్సి ప్యాకెట్స్ అందజేశారు.

నేడు 'వైఎస్‌ఆర్ రైతు భరోసా' నిధులు జమ

ప్రజాశక్తి -కందుకూరు :డాక్టర్ వైఎస్‌ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ పథకం కింద కందుకూరు నియోజక వర్గానికి మొదటి దఫా కింద రూ.19 కోట్ల 12 లక్షలు నిధులు మంజూరైనట్లు సుమారు 34741 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 2న ముఖ్య మంత్రి చేతుల మీదుగా జమ చేయనున్నట్లు కందుకూరు ఎడిఎ ముత్యాల శేషగిరి తెలిపారు. మండలాల వారీగా మంజూరైన నిధుల వివరాలను ఆయన వెల్లడిం చారు. అర్హులైన రైతుల జాబితాను ప్రతి రైతు భరోసా కేంద్రంలో అందు బాటులో ఉంచామని తెలిపారు. ఎవరైనా రైతులు అర్హత కలిగి ఉండి, లబ్దిదారుల జాబితాలో లేనట్లయితే సంబంధిత వ్యవసాయ అధికారిణి సంప్రదించాలని సూచించారు.

నిందితులపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి -నెల్లూరు :జిల్లాలో వివిధ కేసుల్లో నిందితులైన ముగ్గురు మహిళలతో పాటు ఇద్దరు పురుషులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్‌పి డాక్టర్ కె తిరుమలేశ్వర రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడంచారు. నగరంలోని కపాడిపాలెం ప్రాంతానికి చెందిన అరవ రాజమ్మ, షేక్ సిరాజ్, షేక్ సుభాని, షేక్ ముంతాజ్, వెంగళరావు నగర్ ప్రాంతానికి చెందిన చెరుకూరి వెంకటేశ్వర్లు పై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకం, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు హెచ్చరించారు.

ఎస్‌ఐ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు పోలీస్ స్టేషన్ లో నూతన ఎస్‌ఐగా జంపానీ కుమార్ బుధవారం అధికార బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ కె. ఇంద్రసేనా రెడ్డి ఉదయగిరి పోలీస్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు ట్రాఫిక్ సౌత్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ జంపానీ కుమార్ నియమితులయ్యారు.

6న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -కందుకూరు :

ఒయాసిస్ ఫెర్టిలిటీ ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరం కందుకూరులో హరిణి ప్రజా వైద్యశాల, కందుకూరులో ఈనెల 6నఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ ముస్తాఫ్ తెలిపారు. సంతానలేమి స్పెషలిస్ట్ డాక్టర్ దీపిక బొప్పన చేత ఉచిత కన్సల్టేషన్, స్కాన్,కౌన్సిలింగ్ చేయనున్నట్లు తెలిపారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం

ఆరోగ్యానికి హానికరం

పలుచోట్ల పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాలు




ప్రజాశక్తి -నెల్లూరు

పొగాకును అతిగా వాడడం వల్ల అరోగ్యానికి కారణమని నారాయణ డెంటల్ కాలేజ్ హెచ్.ఒ.డి డాక్టర్ యన్.కన్నన్ పేర్కొన్నారు. నారాయణ డెంటల్ హాస్పిటల్, కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్, (పిఎంపి) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా పొగాకు విముక్తి ఆందోళన అనే కరపత్రం విడుదల చేశారు. ప్రయాణికులకు పొగాకు వల్ల వచ్చే వ్యాధుల మీద అవగాహన కల్పించారు. ఆర్‌టిసి బ్రాంచ్ మేనేజర్ కె.వి.మురళీకష్ణ మాట్లాడారు. సెంట్రల్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి పరవస్తు, పిఎంపి గౌరవాధ్యక్షులు ఎ జయప్రకాష్, నారాయణ డెంటల్ కాలేజీ డీన్ డాక్టర్ శివకుమార్ డా.అజయ్ కుమార్, డా.కె చిరంజీవి, పి.ఎం.పి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, జి.శేషయ్య, సి.వీరయ్య, టి.చంద్రశేఖర్, ఆర్ టి సి కంట్రోలర్ కష్ణయ్య పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వినియోగం సరికాదు

పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రాణాంతకమని డి సి హెచ్ ఎస్ డాక్టర్ రమేష్ నాథ్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్క రించుకొని వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నగరంలోని బిఇడి కళాశాల నుంచి డిఎంహెచ్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఎన్ సి డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ బ్రిజిత, డాక్టర్ హరిచంద్ర సతీష్ డాక్టర్ శివకుమారి డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

వెంకటాచలం : కాకుటూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాల యంలో బుధవారం జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని విశ్వవిద్యాలయ ప్రాగణం లోని సి వి రామన్ సిమినర్ హాలులో ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. పొగాకుకు వ్యతిరేక గాంగా ప్రతిజ్ఞ చేశారు. సుందరవల్లి మాట్లాడుతూ పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికం ఉంటాయన్నారు. పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుం దన్నారు. ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పి.రామచంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి. విజయ ఆనంద కుమార్ బాబు బాబు మాట్లాడారు. కె. సునీత యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ఆచార్య సుజా ఎస్ నాయర్, డాక్టర్ సాయి ప్రసాద్ రెడ్డి, డా. యం.హనుమ రెడ్డి, డా.శ్రీ కన్యా రావు ఉన్నారు.



కాకుటూరిలోని విఎస్‌యులో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపకులపతి , ఆచార్యులు

పొగాకు వేలం కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి -కందుకూరు :

పొగాకు బోర్డు సెక్రటరీ ఇన్‌ఛార్జి మేనేజర్ ఆక్షన్ దివి వేణుగోపాల్, ఎం లక్ష్మణ రావు రీజనల్ మేనేజర్ కందుకూరు 26, 27 వేలం కేంద్రాలను బుధవారం సందర్శిం చారు. అక్కడ జరుగుతున్న పొగాకు వేలాన్ని పరిశీలించారు. రైతులు జరుగుతున్న మార్కెట్‌కు అను గుణంగా బేళ్ల విక్రయిం చుకోవాలని సూచించారు. రాబోయే పంట కాలానికి పచ్చి రొట్ట ఎరువులను విధిగా వాడాలని సూచించారు. వేలం కేంద్రం ఆవరణలో మొక్కలు పెంచాలని నిర్వాహకులకు సూచించారు.



సైడ్ కాలువలు నిర్మించాలి

ప్రజాశక్తి -గుడ్లూరు :

మండలంలోని బసిరెడ్డి పాలెం, రాళ్లపాడు గ్రామాల్లో సిసి రోడ్లకు ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మించాలని, మురుగు నీరు పారుదలకి ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఎ, ఆయా గ్రామాల్లో బుధవారం ఇంటింటికి తిరిగారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిపి పులి రమేష్, జడ్పిటిసి సభ్యులు కొరిసపాటి బాబిరెడ్డి ,గ్రామ సర్పంచ్ ఇండ్లూర్ డేవిడ్ ,రాళ్లపాడు సర్పంచ్ యనమల మంద శ్రీనివాసులు, మండల తాసిల్దార్ సూర్యనారాయణ సింగ్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు

టిప్పర్లు సీజ్ చేసిన పోలీసులు



ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు జంభో టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని కొత్తకోడూరు ప్రాంతం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను కష్ణపట్నం సిఐ కె. వేమారెడ్డి, ఎస్‌ఐ జంపాని కుమార్ బుధవారం సీజ్ చేశారు. డ్రైవర్ల హరికష్ణ, కెఎ మల్లికార్జున, జి. వంశీలను అదుపులోకి తీసుకొని, టిప్పర్లను పోలీసు స్టేషన్ కు తరలించారు. టిప్పర్ల యజమానులు తిరకాల రూపేష్, ఏపూరు కష్ణలపై కేసు నమోదు చేశారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న సమాచారాన్ని పోలీసులు మైనింగ్ అండ్ జియోలాజి అసిస్టెంట్ డైరెక్టర్ కు అందజేశారు.

కార్యదర్శులకు సూచనలు

నెల్లూరు : నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ కార్యదర్శులతో కమిషనర్ వికాస్ మర్మత్ సమీక్ష నిర్వహించారు. స్థానిక కార్పొరేషన్‌లోని ఎపిజె అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ జగనన్నకు చెబుదాం.. స్పందన ఫిర్యాదులపై కార్యదర్శులతో సమీక్ష నిర్వహిం చారు. సదరు సమీక్షలో నగరంలోని మౌలిక సదుపాయాల కల్పనపై వచ్చు చున్న ఫిర్యాదులకు సచివాలయాల స్థాయిలోనే పరిష్కారం అందించాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, నగర పాలక సంస్థ ఇంజి నీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతి

తోటపల్లిగూడూరు :మండలంలోని నరుకూరు గ్రామానికి చెందిన తెలుగు యువత ప్రతినిధి రమణ (40) అనారోగ్యంతో మతి చెందారు. రమణ మతదేహాన్ని బుధవారం సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయ కర్త సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి సందర్శించి, నివాళు లర్పించారు. కార్యక్రమంలో నరుకూరు ఎంపిటిసి సభ్యులు కొణతం రఘుబాబు, మాజీ ఎంపిటిసి పాకం వెంకయ్య పాల్గొన్నారు. రమణ భార్య సుమలత కూడా అనారోగ్యంతో మతి చెందడం అత్యంత విచారకరమన్నారు. రమణ, సుమలత దంపతులు ఇరువురి మతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న మంత్రి కాకాణి దంపతులు

మంత్రి 'కాకాణి' ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -పొదలకూరు :సర్వేపల్లి నియోజకవర్గంలో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఇప్పటికి 28 దేవాలయాలను నిర్మించి, ప్రారంభించినటు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మరుపూరు గ్రామంలో పునర్నిర్మించిన కామాక్షి సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో గత మూడు రోజుల గా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం ఆయన పాల్గొన్నారు. ఉత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పూజా కార్యక్రమాల ను ఆయన వీక్షించారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైసిపి నేతలు చంద్రశేఖర్ రెడ్డి, జి. గోపాల్ రెడ్డి, ఏనుగు శశిధర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

హత్యకేసులో నిందితుడు అరెస్టు



ప్రజాశక్తి-కోవూరు

మహిళను కిడ్నాప్ చేసి హత్యచేసిన కేసులో పరారీలోని నిందితుడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈసంఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మండలంలోని స్టౌబీడీ కాలనీలోని మూడో వీధిలో కాపురం ఉంటున్న నసీమ (49) తన భర్త బాబు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ సుమారు 10 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తన ముగ్గురు సంతానంలో పెద్ద కొడుకు షేక్ మస్తాన్ వద్దనే ఉంటుంది. సాలుచింతలలోని బాబయ్య పెంకుల బట్టీలో పెంకులకోసే కూలీ పనికి వెళ్తుండేది. నసీమను ప్రతి రోజూ వేకువజామున 03.30 గంటలకు తన కొడుకు మస్తాన్ తన బైక్ లో ఎక్కించుకొని బాబయ్య పెంకుల బట్టీ వద్ద వదిలిపెడుతుంటాడు. అదే విధంగా రోజూలాగే తేది.01.04.2023న ఉదయం సుమారు 03.00 గంటలకు మస్తాన్ వాళ్ల అమ్మ నసీమను అతని బైక్ పై ఎక్కించుకొని బాబయ్య పెంకుల బట్టీ దగ్గర వదిలి అక్కడ నుండి వెళ్లి పోయాడు. ముద్దాయి తాత హరి కిషోర్ దగదర్తి మండలం, తురుమెర్ల గ్రామం. ప్రస్తుతం నెల్లూరు టౌన్ లోని నవాబ్ పేటలోని యనమల పాలెంలో నివాసం ఉంటున్నాడు.అతను వారధి సెంటరు మీదుగా కోవూరుకు వస్తుండగా వేకువ జామున సుమారు 03:45 గంటలకు సాలుచింతల వద్ద ఉన్న పెంకుల బట్టి వద్ద మట్టి కలుపుతూ ఒంటరిగా ఉన్న నసీమను చూశాడు. ఆమెపై ఎలాగైనా శారీరకంగా అనుభవించాలని కోరికతో ఆమె వద్దకెళ్లి తాను పోలీసు అని ఒంటరిగా ఇక్కడ ఏమి చేస్తున్నావు..పోలీసు స్టేషన్‌కు రా.. అంటూ గట్టిగా గదమాయించాడు.వెంటనే ఆమెను తన బైకులో ఎక్కించుకొని స్టౌబీడీ కాలనీ, బజారు సెంటర్, పోలీసు స్టేషన్ మీదుగా జాతీయరహదారి వచ్చినన్న సాయిబాబా గుడికి ఉత్తరం వైపు ఉన్న డొంక రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ నసీమను శారీరకంగా కలవాలని, లేదంటే చంపుతానని బెదిరించాడు. ఆమె ప్రతిఘటించి చెంది.దీంతో అతను ఆమె తలను గ్రావెల్ రోడ్డు కేసి బలంగా కొట్టి చంపి పారిపోయాడు.కోవూరు సిఐ రామకృష్ణారెడ్డి తన సిబ్బంది తో అరెస్టు చేశారు.ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన కోవూరు సిఐ, ఎస్ఐ వారి సిబ్బందిని నెల్లూరురూరల్ డిఎస్‌పి వీరాంజనేయ రెడ్డి, ఎస్‌పి కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, అభినందించి క్యాష్ రివార్డులు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని పొంగూరు గ్రామానికి చెందిన నల్లని రమేష్ (47) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. బుధవారం తమ ఇంట్లో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవ శాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌తో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోలీసులు కేసునమోదు చేశారు.

ఆటో బోల్తా డ్రైవర్‌కి గాయాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు : వేగంగా వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తాపడి డ్రైవర్‌కి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని విరువూరు సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పామూరుకు చెందిన ఆటో పామూరు నుండి ప్రయాణికులతో పెద్దిరెడ్డిపల్లి వచ్చిన ఆటో వారిని దింపి తిరుగు ప్రయాణంలో ఒకటే వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ కలామ్ తలకు తీవ్ర గాయాలు అవగా అతనిని చికిత్స నిమిత్తం పామూరు వైద్యశాలకు తరలించారు.

ఆటో బోల్తా ఒకరు మృతి

ప్రజాశక్తి-కోవూరు : ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ఇనమడుగు సెంటర్లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పురిణి గ్రామం కొత్తపాలెంకు చెందిన వెంకటేశ్వర్లు(70) సిమెంట్ పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం ఆటో ఎక్కి నెల్లూరు వస్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి అక్కడికక్కడే మతి చెందాడు. మతదేహాని పంచనామా నిమిత్తం స్థానిక కోవూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ తిరు వూరుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని 108 లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి-వరికుంటపాడు : గుట్టు చప్పుడు కాకుండా కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని గొల్లపల్లి ఎస్‌టి కాలనీ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ముందస్తు సమాచారం అందుకున్న ఎస్ఐ విజయ్ శ్రీనివాస్ తన సిబ్బందితో దాడి చేయగా ఐదుగురు పందెపురాయుళ్లతో పాటు, ఐదు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.3600 నగదును, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

రూ.5.72 లక్షల రుసుము వసూలు

ప్రజాశక్తి-ఉదయగిరి : అక్రమ క్వారీ నిర్వాహకుల నుండి 5 లక్షల 72 వేల 176 రూపాయల అపరాధ రుసుము వసూలు చేసినట్టు ఉదయగిరి అటవీ శాఖ రేంజ్ అధికారి టి.ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఇటీవల రేంజ్ పరిధిలోని వరికుంటపాడు మండలం బోయమడుగుల గ్రామ సమీపంలోని గువ్వాడి తూర్పు రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా తెల్లారాయి తవ్వకాలు జరుపుతుండగా కేసు నమోదు చేసి మిషన్ టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. అందులో భాగంగా జిల్లా అటవీ శాఖ అధికారి వాహనాలు వేసిన అపరాధ రుసుము అక్రమ నిర్వహకు నుండి వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అటవీ భూములలోకి ప్రవేశించి అటవీ నేరాలకు పాలుపడిన అడవుల్లో తవ్వకాలు జరిపిన అట్టి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా క్వారీలను నడపడం అడవులోని ఖనిజాలను వృక్షాలను తరలించే వారిపై ఉపేక్షించేది లేదన్నారు. అనుమానా స్పందంగా గ్రామంలో అడవుల్లో సంచరించే వారి వివరాలను గ్రామస్తులు తెలపాలని తెలిపిన వారివివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఫకీర్లకు బిసి సర్టిఫికెట్లు మంజూరు చేయించాలి

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని నందరంలో ఫకీర్లు తమకు గతంలో బిసి సర్టిఫికెట్లు మంజూరు చేస్తూ ఉండేవారని, ప్రస్తుతం నిలిపివేశారని స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులతో కలసి ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎంఎల్‌ఎ బుధవారం జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను కలిసి ఫకీర్ల బీసీ సర్టిఫికెట్ల విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిశీలించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంఎల్‌ఎకు తెలిపారు.

నేటినుంచి అంగన్‌వాడీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉదయగిరి : గురువారం నుండి 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలను నడపాలని సిడిపిఒ పచ్చావ లావణ్య పేర్కొన్నారు. బుధవారం అమే మాట్లాడుతూ ప్రాజెట్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రంలో సమయ పాలన పాటిస్తూ రెండు పూటలా సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని చిన్నారులకు గర్భిణీ, బాలింతలకు అందించాలన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బంది పిల్లల హాజరు తదితర సర్వేలు యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ సెంటర్ నాడు-నేడులో మరమత్తులు జరుగుతున్నయని వేంపాడులో ఒక సెంటర్ ప్రారంభం సిద్ధంగా ఉందన్నారు.

ఉప్పలపాడులో విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-అనంతసాగరం : గ్రామాల్లో ఆలయాల నిర్మాణం, పునర్‌నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఆయన మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పునర్‌నిర్మించిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉప్పలపాడు గ్రామంలో భక్తులు, దాతల సహకారంతో అద్భుతంగా ఆలయాన్ని పునర్నిర్మించడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-సంగం : మండలంలోని అన్నారెడ్డిపాలెం గ్రామంలోని సీతాలక్ష్మణ సమేతా ఆత్మ రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్లు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయ అర్చకులు పరిమళ పుష్పలతో అందంగా అలంకరించిన శేష వాహనంపై స్వామి అమ్మవార్లను కొలువుదీచ్చారు. అనంతరం హారతి కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగింది. కార్యక్రమాలకి మద్దిశెట్టి వెంకటరమణయ్య, జగన్నాధం, ఏడుకొండలు, సూరా వెంకటేశ్వర్లు, వేదగిరి భరత్ కుమార్, పొట్టేపాళెం ప్రసాద్, పాటూరు బుజ్జియ్య, భీమతాటి రాము, పగడాల శ్రీహరి, దాతలుగా వ్యవహరించారు. బండ హరి కిషోర్ రెడ్డి, గ్రామ యువకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

గ్రావెల్ గుంతలు పరిశీలన

ప్రజాశక్తి-కావలి

రుద్రకోట గ్రామంలో అధికార పార్టీ నేతలు అక్రమంగా తవ్వుతున్న గ్రావెల్ గుంతలను బుధవారం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక, కావలి బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నేతలు "కావలి ఎంఎల్ఎ మట్టి దోపిడీ"పై మండిపడ్డారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చింతాల వెంకటరావు మాట్లాడుతూ అధికార పార్టీ దోపిడీలో భాగంగానే గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. జెసిబిలు డంపర్లు గుంతల్లోకి పోతే కనపడని విధంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రిషికొండ దగ్గర నుంచి మారుమూల ప్రాంతం వరకు అధికారం అడ్డుపెట్టుకొని అన్నింటినీ కొల్లగొడుతున్నారన్నారు. వీరి దోపిడీ ప్రకృతికే క్రాఫ్ చేస్తున్న విధంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజలు ప్రశ్నించకపోతే రేపు మన ఇండ్లను కూడా వారు కబ్జా చేస్తారన్నారు. ఎప్పుడు అవకాశం వచ్చినా వైసిపి పార్టీకి డిపాజిట్లు కూడా రాకుండా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వేదిక కన్వీనర్ సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో మట్టి దోపిడీలో కావలి ఎమ్మెల్యే "నెవర్ బిఫోర్ - ఎవర్ ఆఫ్టర్" అని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

రుద్రకోటలో గ్రావెల్ తవ్వకాలు సింగరేణి బొగ్గు గనులను తలపించే విధంగా, కెజిఎఫ్ గనులను మైమరిపించే విధంగా ఉన్నాయన్నారు. సుమారు 30 అడుగుల లోతుకుపైగా గ్రావెల్‌ను అక్రమంగా తవ్వుతున్నారని తెలిపారు. కావలి ఎంఎల్ఎ కావలి సహజవనరులను కొల్లగొడుతున్నారన్నారు. అధికారులు కళ్లకు గంతులు కట్టుకున్నారా.. అని ప్రశ్నించారు. తక్షణమే గ్రావెల్ దోపిడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ చెరువు కన్నా లోతుగా గ్రావెల్‌ను అక్రమంగా తవ్వారన్నారు. ఎవరి అనుమతులతో గ్రావెల్ తవ్వుతున్నారని ప్రశ్నించారు. రోజుకు 150 ట్రిప్పులకు పైగా గ్రావెల్ అక్రమంగా తరలి వెళ్తునందన్నారు. జనసేన పట్టణ అధ్యక్షులు పొబ్బ సాయి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మట్టి, ఇసుక దొరకని విధంగా దోపిడీ చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో చెరువులు, కుంటలు, మిగలవన్నారు. ప్రభుత్వ వనరులను స్వంత లాభాల కోసం దోపిడీ చేస్తున్నారని తెలిపారు. అధికారులు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. నాలుగేళ్లలో కావలి ఎంఎల్ఎ ఏమి అభివృద్ధి చేసారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐఎంఎల్ నాయకులు లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ తాటిచెట్టంత లోతున గ్రావెల్ అక్రమంగా కొల్లగొడుతున్నారన్నారు. అక్రమ గ్రావెల్‌ను అడ్డుకున్నందుకు గ్రామస్తులపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు సిద్ధమవ్వాలన్నారు. అఖిలపక్ష నాయకులు సిపిఎం నాయకులు పి.పెంచలయ్య మాట్లాడుతూ అక్రమ గ్రావెల్ తవ్వకాల పట్ల అధికారులు నిమ్మకు నీరేతినట్లు ఉన్నారన్నారు. అనుమతులు లేకుండా కోట్ల రూపాయల గ్రావెల్ ను తవ్వుతున్నారని తెలిపారు. అనంతరం అక్రమగా కేసులు బనాయించిన గ్రామస్తులను విచారించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరసింహరావు, జనసేన నాయకులు గడే నాగార్జున తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి మేకపాటి పరామర్శ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు షేక్ కలాం సోదరుడు రహీం బుధవారం ఉదయం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులతో కలసి రహీం ఇంటికి చేరుకున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కుటుంబసభ్యులను రహీం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఎంఎల్ఎ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులతో కలసి రహీం ఇంటికి చేరుకున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కుటుంబసభ్యులను రహీం మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్ కుమార్, నాయకులు జమీర్, తదితరులున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ శీనానాయక్

లే అవుట్ రికార్డులు పరిశీలన

ప్రజాశక్తి-దగదర్తి

తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం కావలి ఆర్‌డిఒ శీనానాయక్ జగనన్న లే అవుట్ సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం జగన్ కాలనీలకు సంబంధించి ఎన్ని గ్రామాల్లో కోరు కేసులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసుల పరిష్కారం కానిచోట ప్రత్యాయంగా ల్యాండ్‌ను చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామాలకు గానూ 11 గ్రామాలకు కోర్టు కేసులు నడుస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి తాళ్లూరు వెంకట ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు జగన్ అన్న లేఅవుట్ పత్రాలను అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు పెంచలయ్య, డివిజన్ సర్వేయర్ రాము, సర్వేయర్ శివ, ఈ సర్వే డి టి వి, ఆర్ ఐ వెంకటేశ్వర్లు, విఆర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న ఎస్‌ఐ

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు దిశ పోలీస్ స్టేషన్లో ఎఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మార్టూరి.పరమేశ్వరి, వారిఅమ్మ మార్టూరి.సరోజనమ్మ జ్ఞాపకార్థంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా సంస్థ కార్యాలయంలో పెంకుల ఫ్యాక్టరీ శివరామ సుబ్బయ్య కాలనీలో నివాసం ఉంటున్న వద్ద దంపతులు పోతురాజు - అంజమ్మ గార్లకు నూతన వస్త్రాలు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, బియ్యం వితరణ చేశారు. అంతేకాకుండా బుడంగుంట గిరిజన ప్రాంతంలో 100మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో నేటి దాత ఎఎస్‌ఐ మార్టూరి.పరమేశ్వరి, ఆమె భర్త ఎఎస్‌ఐ మోతుకూరు.మోహన్, సంస్థ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, దాత అక్క పద్మ, దాత కుమార్తె అజిత, సంస్థ వాలంటీర్స్ రేష్మ, కరిష్మా, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ఎస్ఐగా కర్నాటి ఇంద్రసేనా రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి గూడూరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల భాగంగా ఉదయగిరి ఎస్ఐగా బాధ్యతలు చేపట్టామన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ ఎన్.ప్రభాకర్ దుత్తలూరు మండలానికి బదిలీ అయ్యారన్నారు. మండలాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతకు పెద్దపీట వేస్తామని ఆయన తెలిపారు. అనంతరం సిబ్బందితో సమీక్ష అయి ప్రతిఒక్కరితో స్నేహపూర్వకంగా మెలిగి ఫిర్యాదారులపై మర్యాదపూర్వకంగా ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, ప్రజోపయోగమైన పనులు, జగనన్న ఇళ్ల తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను బుధవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ హైలెవల్ కెనాల్ నిర్మాణంలో భాగంగా భూములు అందచేసిన మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి గ్రామ రైతులకు నష్టపరిహారం అందజేయాలని కోరారు. అదే విధంగా పడమటి నాయుడుపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలతో పాటు సమీప నియోజకవర్గాల ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తుందని, జిల్లా వైద్యశాలకు అదనపు సౌకర్యాలు ఏర్పాటుకు ఎపిఎంఎస్ ఐడిసి ద్వారా నిధుల మంజూరు విషయమై చొరవ చూపాలని కోరారు. మర్రిపాడు మండలం భీమవరం గ్రామంలో, ఆత్మకూరు మండలం బోయలచిరువెళ్ల, అనంతసాగరం మండలం గౌరవరంలలో నూతన అంగన్‌వాడీ భవనాలను మంజూరు చేయించాలన్నారు. చిలకపాడు గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు క్రీడామైదానానికి స్థలం కేటాయించాలని కోరారు. ఆత్మకూరు మండలం కరటంపాడులో నూతనంగా మంజూరు చేసిన బీసీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు అనుసంధానంగా నూతనంగా ఎస్‌సి వెల్ఫేర్ బిల్డింగు మంజూరు చేయించాలని కోరారు. మురగళ్ల గ్రామంలోని శ్మశానవాటికకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 14వ ఆర్థిక సంఘం ద్వారా జరిగిన అభివృద్ధి పనులు సిఎఫ్‌ఎంఎస్ అప్లోడ్ జరగకుండా నిలిచాయని, బిల్లుల మంజూరుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని ఎల్వాల్లి పాఠశాల వద్ద ఖాళీగా ఉన్న ఇరిగేషన్ భూమిపై పాఠశాల నిర్మాణానికి కేటాయించాలని కోరారు. సంగం మండలం అన్నారెడ్డిపాళెంలో ఇంటి స్థలాల మంజూరుకు స్థల సేకరణ త్వరితగతిన చేపట్టాలని, గాంధీజన సంఘంలో 40 మంది. వెంగారెడ్డిపాళెంలో 30 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేసేరా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రమైన సంగంలో శ్మశానవాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించేలా చూడాలని, సర్వే నెంబర్ 252లో కొండ పోరంబోకు భూమిలో 15 మంది లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్ల కోసం విన్నవించారని, విషయమై పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అన్నారెడ్డిపాళెం గ్రామంలో తాగునీటి పైప్ లైన్ మంజూరు చేయించాలన్నారు. ఎఎస్‌పేట మండలం శ్రీకొలనులోని కమ్యూనిటీ హాల్ మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించాలని, జువ్వలగుంటపల్లిలో అదనపు తరగతి గదులు అవసరమని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీకొలను ఎస్‌సి కాలనీలో నూతనంగా 34 మంది లబ్ధిదారులు ఇళ్ల మంజూరు చేయించాలని కోరారని, త్వరితగతిన వారికి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రమైన అనంతసాగరంకు మినీ స్టేడియం మంజూరు చేయించాలని, అదే విధంగా అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు, కళ్యాణ మండపం నిర్మాణాలకు భూమిని కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొమ్మలేరు మీడియం డ్రైన్ వెడల్పు పనుల కోసం శంకరనగరం, మినగల్లు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతులు భూములు అందచేశారని, వారికి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కచిరిదేవరాయపల్లిలోని గుర్రం కాలువ మరమ్మతుల కోసం డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేయాలని, శంకరనగరం గ్రామంలోని ఎంపిపి పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఆదురుపల్లి ఎబిఎస్‌సి వెల్ఫేర్ రెసెన్షియల్ పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం, తాగునీటి వసతి కల్పించాలని, మండల కేంద్రమైన చేజర్లలోని ఊటకాలువ, గ్రామ మసీదు బావి పునరుద్ధరణ కోసం చర్యలు చేపట్టాలని కోరారు.



కలెక్టర్‌కు వినతినిస్తున్న ఎంఎల్ఎ విక్రమ్‌రెడ్డి

'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని రేవూరు గ్రామంలో బుధవారం ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలో రూ.33 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, అధికారులతో కలసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 93 సచివాలయాల్లో 56వ సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాము గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రతిపక్ష పార్టీలు బాదుడే బాదుడు లాంటి కార్యక్రమాలను ప్రారంభించి ప్రభుత్వంపై బురదజల్లే విధంగా ప్రజల్లోకి తీసుకొచ్చారని, అవి అన్ని దారుణంగా విఫలమయ్యాయన్నారు. నాలుగు సంవత్సరాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రం దివాళా తీస్తుందని, ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని ఎన్నో రకాలుగా వ్యాఖ్యలు చేశారని, కానీ నాలుగు రోజుల క్రితం జరిగిన తమ పార్టీ కార్యక్రమంలో జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనే పేర్లు మార్చి వివరించారని, పరోక్షంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకు వాళ్లు కూడా సమర్థించారన్నారు. ప్రతిపక్ష పార్టీలు 2009, 2014లలో తాము ప్రజల కోసం ప్రకటించిన ఎన్నికల మెనిఫెస్టోలను ప్రజల్లోకి తీసుకొచ్చి ఎంత వరకు అమలు చేశారో వివరించాలని తెలిపారు. అదే విధంగా 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన మెనిఫెస్టో ఎలా అమలు జరిగిందో ప్రజలే వారికి వివరిస్తారని అన్నారు. 2014 ఎన్నికల్లో సమయంలో ప్రతిపక్ష పార్టీ రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, ఆ సమయంలోనే జగనన్న ఆ పథకం వర్తింప చేయడం వీలుకాదని తెలిపారని, అప్పట్లో ప్రజలు ఆయనను నమ్మి గెలిపిస్తే రుణమాఫీ ఎంత మేరకు అమలు చేశారో ప్రతి ఒక్కరికీ తెలుసనన్నారు. మహిళలు తీసుకున్న రుణాలను పూర్తిగా రుణమాఫీ చేస్తామని చెప్పారని, కానీ వారు అమలు చేయకపోవడంతో జగనన్నే మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ రుణమాఫీ నగదును అక్కచెల్లెమ్మలకు అందించి వారిని ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు.





రాజగోపాల్‌రెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి-ఉదయగిరి

వైసిపి పార్టీ ఇన్‌ఛార్జిగా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని సిఎం జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించడాన్ని అభినందించిన ఉదయగిరి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నెల్లూరులోని మేకపాటి రాజమోహన్ రెడ్డి స్వగృహంలో జెడ్‌పి కోఆప్టెడ్ సభ్యులు షేక్ గాజుల తాజుద్దీన్, స్థానిక నాయకులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పెద్ద ఎత్తున కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన నిర్ణయం తీసుకుని ఉదయగిరి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జిగా మేకపాటి రాజగోపాల్ రెడ్డి నిర్ణయించడం రాజమోహన్ రెడ్డి మాటకు విలువనివ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానికులు వైసిపి యూత్ నాయకులు షేక్ గాజుల షర్ఫుద్దీన్, మండల సభ్యులు కోఆప్టెడ్ సుహాసిని, ఖాజా నవాజ్, అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం అలిచర్ల బంగారుపాలెం గ్రామానికి చెందిన వాయిల.నవీన్ ఇటీవల సముద్రంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి మరణించాడు. ఈ విషయం గ్రామ కాపులు, యువత కలసి కాంద్ర యువ నేస్తం సభ్యులకు తెలియజేయగా వారు ఈ విశయాన్ని కాంద్ర షతిష్ నాయుడు దృష్టికి తీసుకొని పోగా వారు స్పందించి కాంద్ర యువనేస్తం సభ్యులు గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి పిట్ల ప్రత్యూష్‌కుమార్ చేతులు మీదగా వారి కుటుంబ సభ్యులకు బుధవారం రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. బాపట్ల వెంకటపతి మాట్లాడుతూ పేద కుటుంబాలు కష్టాలలో ఉన్నప్పుడు వారిని ఆదరించి ఆ కుటుంబానికి ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోడంలో కాంద్ర సతీష్ నాయుడు ఎప్పుడు ముందుంటారని ఎక్కడ పేద, బడుగు, బలహీన వర్గాలు ఉంటారో అక్కడ నేనుంటాననే భరోసా పేద ప్రజలకు కలిగే విధంగా వారు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో గ్రామకాపులు యువత మామిడాల.జగదీశ్, ప్రకాశ్, వెంకటరెడ్డి, వెంకటరమణ, వంశీ, రాము, శ్రీనివాసులు, హరి ప్రసాద్, హరికృష్ణ, శివ, వాసు, లక్ష్మణ్, రాఖేష్, గోపాల్, అనిల్, ప్రభాకర్, వెంకటరమణ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం





ఆత్మకూరులో...


ప్రజాశక్తి-కావలి

సమాజంలో పొగాకు హానికరమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని కావలి డిఎస్‌పి వెంకటరమణ పేర్కొన్నారు. కావలి పట్టణం డిఎస్‌పి ఆవరణంలో బహిరంగ ప్రదేశాలలో పొగాకు వాడకం హానికరమని ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నిషేధిత కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో 1వ పట్టణ సిఐ శ్రీనివాసులు, ఎస్.సి., ఎస్.టి. జిల్లా విజిలె న్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, న్యాయవాది ఐ.సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాల కొండారెడ్డి పాల్గొని, పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్టిక్కర్లు అంటించి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ, దీనివల్లనోటి కేన్సర్, శ్వాస కోశ కేన్సర్లు వస్తాయని తెలిపారు.

పొగాకు ఉత్పత్తులకు నివారించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని డాక్టర్ అనూష డాక్టర్ సల్మాలు అన్నారు. బుధవారం పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మహిమలూరు పిహెచ్‌సి డాక్టర్ అనూష, ఆత్మకూరు అర్బన్ పిహెచ్‌సి డాక్టర్ అస్మాలు ఆరోగ్య సిబ్బందితో కలసి ఆత్మకూరు బస్టాండ్ నుండి సోమశిల రోడ్డు వరకు పొగాకును వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్బన్ పిహెచ్‌సిలో మీటింగ్ ఏర్పాటు చేసి పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాల గురించి తెలియజేశారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నష్టాలే అధికంగా ఉంటాయని పొగాకు శరీర అవయవాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని ఊపిరితిత్తులకు ముప్పు వాటిల్లి ఎంఫసియా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ ఫల్మనరీ డిసీజ్ లాంటి ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయని గొంతు కేన్సర్, నోటి కేన్సర్, గుండెపోటు వచ్చే అవకాశం ఉందని కావున పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్.సుధాకర్, మల్లెం కొండయ్య, శైలజ, ఎస్‌డి రషీద్, యు.లలితమ్మ, ఎఎన్‌ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



నేటినుంచి 'డయల్ యువర్ డిఎం'

ప్రజాశక్తి-కావలి

జూన్ 1వ తేదీ నుంచి గురువారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. కావున ప్రజలు, ప్రయాణికులు 9959225643 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇచ్చి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి సహకరించాలని కోరారు. కావలి డిపో పరిధిలోని ప్రాంతాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను తెలపాలని, ఆర్‌టిసి కల్పిస్తున్న సౌకర్యాలను, పథకాలను, రాయితీల గురించి తెలుసుకుని కావలి డిపో అభివృద్ధికి దోహద పడాలన్నారు.